ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 275 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
బుధవారం 07 మే 2025
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

2050 నాటికి చంద్రుడిపై
భారతీయుడు అడుగుపెడతాడు: ప్రధాని మోదీ

దిల్లీలో 'గ్లోబల్ స్పేస్ ఎక్స్ ప్లోరేషన్ సదస్సు' సందర్భంగా మోదీ ప్రసంగించారు.

దిల్లీ, మే 7, (రిపబ్లిక్ న్యూస్): అంతరిక్షంలో భారత్ ఎన్నో విజయాలు సాధిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. 'గ్లోబల్ స్పేస్ ఎక్స్లోరేషన్ సదస్సు' ప్రారంభం సందర్భంగా మోదీ ప్రసంగించారు. మంగళ్యాన్, చంద్రయాన్ వంటి ప్రయోగాలు విజయవంతంగా నిర్వహించామన్నారు. చంద్రుడిపై నీటి జాడ ఉందని తొలిసారి చంద్రయాన్ ద్వారా గుర్తించామన్నారు.

దక్షిణాసియా దేశాల కోసం ప్రత్యేక ఉపగ్రహం ప్రయోగించినట్లు గుర్తు చేశారు. త్వరలో భారత వ్యోమగామి రోదసీలో పర్యటిస్తాడని మోదీ పేర్కొన్నారు. 2050 నాటికి చంద్రుడిపై భారతీయుడు అడుగు పెడతాడని వెల్లడించారు. దిల్లీలో గ్లోబల్ స్పేస్ ఎక్స్ ప్లోరేషన్ కాన్ఫరెన్స్ నేటినుంచి 9 వరకు జరగనుంది. మరోవైపు 'ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ పలు దేశాల పర్యటనలను రద్దు చేసుకున్నారు.

ఆపరేషన్ సిందూర్...
రాష్ట్రపతితో ప్రధాని మోదీ భేటీ

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో గురువారం కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష భేటీని నిర్వహించనుంది.

దిల్లీ, మే 7, (రిపబ్లిక్ న్యూస్): పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకార చర్యలు చేపట్టింది. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్ ఉగ్రస్థావరాలపై విరుచుకుపడింది. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో ప్రధాని నరేంద్ర మోదీభేటీ అయ్యారు. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్లోని ఉగ్రస్థావరాలపై భారత సైన్యం చేపట్టిన దాడుల గురించి రాష్ట్రపతికి ప్రధాని వివరించారు.

రేపు అఖిలపక్ష భేటీ..

మరోవైపు కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చింది. గురువారం ఉదయం 11 గంటలకు జరగబోయే ఈ భేటీలో.. 'ఆపరేషన్ సిందూర్' తదనంతర పరిణామాలను ఆయా పార్టీల నేతలకు ప్రభుత్వం వివరించనుంది. జాతీయ భద్రత విషయంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు సమాచారం. కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్నాథ్సింగ్, హోంశాఖ మంత్రి అమిత్షా, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు తదితరులు ఈ భేటీకి హాజరుకానున్నారు. మరోవైపు భారత మెరుపుదాడులను విపక్ష నేతలు స్వాగతించారు. పాకిస్థాన్ ఉగ్ర చర్యలకు వ్యతిరేకంగా భారత్ తీసుకునే ఎలాంటి నిర్ణయాలకైనా తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో సీడబ్ల్యూసీ సమావేశాన్ని ఈ మధ్యాహ్నం 3 గంటలకు కాంగ్రెస్ నిర్వహించనుంది. ప్రస్తుత పరిణామాలపై కాంగ్రెస్ నేతలు ఈ భేటీలో చర్చించనున్నారు.

అమిత్ అత్యున్నతస్థాయి సమీక్ష

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ సరిహద్దు రాష్ట్రాల సీఎంలు, గవర్నర్లు, డీజీపీలు, ఉన్నతాధికారులతో అత్యున్నత స్థాయి సమీక్ష చేపట్టనున్నారు. ఈ భేటీకి జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బిహార్, సిక్కిం, పశ్చిమబెంగాల్ సీఎంలు, గవర్నర్లు, అధికారులు హాజరుకానున్నారు. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్లోని ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం విరుచుకుపడింది. పాక్ లోని 4, పాక్ ఆక్రమిత కాశ్మీర్లో 5 స్థావరాలపై దాడులు చేసింది. ఇప్పటివరకు అక్కడ 80 మంది వరకు ఉగ్రవాదులు మృతి చెందినట్లు వార్తలొస్తున్నాయి. బవహల్పూర్(జైషే మహమ్మద్), మురిద్కే (లష్కరే తొయిబా) క్యాంపుల్లోనే అత్యధిక మంది ఉగ్రవాదులు చనిపోయినట్లు తెలుస్తోంది.

చివరి ఉగ్రవాదిని అంతం చేసేవరకు మోదీ పోరాటం ఆగదు:పవన్ కల్యాణ్

పాకిస్థాన్లోని ఉగ్ర స్థావరాలపై భారత్ చేసిన దాడులు గర్వించదగ్గ విషయమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.

హైదరాబాద్, మే 7, (రిపబ్లిక్ న్యూస్): పాకిస్థాన్లోని ఉగ్ర స్థావరాలపై భారత్ చేసిన దాడులు గర్వించదగ్గ విషయమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. పహల్గాం ఘటనకు ప్రతీకారం తీర్చుకోవాలని యావత్ దేశం ఎదురుచూసిందని చెప్పారు. ప్రధాని మోదీ నాయకత్వంలో రక్షణ దళాలు దీటుగా పాక్ లోని ఉగ్ర స్థావరాలపై దాడి చేసి బుద్ధి చెప్పాయన్నారు.

హైదరాబాద్లో నిర్వహించిన మీడియా సమావేశంలో పవన్ మాట్లాడారు. మోదీ నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామన్నారు. "పహల్గాంలో హిందువులా? కాదా? అని అడిగి మరీ ఉగ్రవాదులు చంపారు. దేశం మొత్తం పుట్టెడు దుఃఖంలో ఉంది. మోదీ నాయకత్వంలో ఉగ్రవాదంపై యుద్ధం జరుగుతోంది. ఈ సమయంలో ఆయన తీసుకున్న నిర్ణయం పట్ల అందరం గర్వించాలి.. అండగా నిలవాలి. చివరి ఉగ్రవాదిని అంతం చేసేవరకు ఆయన పోరాటం ఆగదు. పాకిస్థాన్కు మద్దతుగా ఆలోచించే నాయకులు తమ వైఖరి మార్చుకోవాలి. భారత సైన్యాన్ని కించపరిచేలా సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకోవాలి" అని పవన్ అన్నారు.

ఆపరేషన్ సిందూర్..
పాక్లోని తమ పౌరులకు అమెరికా అడ్వైజరీ

పాక్ లో సంఘర్షణ జరిగే ప్రాంతాలకు దూరంగా ఉండాలని తమ దేశ పౌరులకు అమెరికా సూచించింది.

న్యూయార్క్, మే 7, (రిపబ్లిక్ న్యూస్): 'ఆపరేషన్ సిందూర్' లో భాగంగా పాకిస్థాన్లోని ఉగ్రస్థావరాలపై భారత్ దాడులు చేపట్టిన నేపథ్యంలో అక్కడ ఉన్న తమ పౌరులకు అమెరికా రాయబార కార్యాలయం పలు హెచ్చరికలు జారీ చేసింది. సాయుధ దళాల సంఘర్షణకు అవకాశం ఉన్నందున భారత్-పాక్ నియంత్రణ రేఖకు సమీపంలో ఉన్న ప్రాంతాలకు ప్రయాణాలు చేయొద్దని సూచించింది. ఇరుదేశాల గగనతలాల మూసివేత, పాక్ లోని పరిస్థితిని ఎప్పటికప్పుడు తాము నిశితంగా గమనిస్తున్నామని వెల్లడించింది.

పాక్ దాడులు జరిగిన ప్రాంతాలకు సమీపంగా ఉన్నవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లి ఆశ్రయం పొందాలని.. అమెరికా అడ్వైజరీ సూచించింది. ఆయా ప్రాంతాలకు వెళ్లాలనుకునేవారు తమ ప్రయాణాలను రద్దు చేసుకోవాలని సూచించింది. కాగా పాక్లోని ఉగ్ర స్థావరాలపై దాడుల విషయంపై అమెరికా ఇప్పటికే స్పందించింది. ఈ ఘర్షణకు వీలైనంత త్వరగా ముగింపు పలకాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. రెండు శక్తిమంతమైన దేశాల మధ్య యుద్ధం ఎవరూ కోరుకోరని.. భారత్, పాక్లకు ఎంతో చరిత్ర ఉందని అన్నారు. వీటి మధ్య ఎన్నో ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ.. ప్రపంచానికి శాంతి మాత్రమే కావాలని, ఘర్షణలు వద్దని అన్నారు. యూఎస్ లోని భారత రాయబార కార్యాలయం మాట్లాడుతూ.. "ఆధారాలు, సాంకేతిక సమాచారం, అక్కడి నుంచి ప్రాణాలతో బయటపడిన వారి సాక్ష్యం ఆధారంగా భారత్.. పాకిస్థాన్లోని ఉగ్ర స్థావరాలపై దాడులకు పాల్పడినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. ఈ దాడిలో అక్కడి పౌర, ఆర్థిక, సైనిక లక్ష్యాల జోలికి భారత్ వెళ్లలేదు. కేవలం ఉగ్రవాద శిబిరాలే లక్ష్యంగా దాడులు జరిగాయి" అని పేర్కొంది. మరోవైపు ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత రాయబారికి పాక్ సమన్లు జారీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

వంద పాకిస్థాన్లకు సమాధానం చెప్పే మిసైల్.. మోదీ
:వీడియో షేర్ చేసిన మంత్రి లోకేశ్

పాక్లో ఉగ్రవాదుల భరతం పట్టేలా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పై ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పందించారు.

అమరావతి, మే 7, (రిపబ్లిక్ న్యూస్): పాక్ ఉగ్రవాదుల భరతం పట్టేలా భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్ పై ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. పహల్గాం దాడికి ప్రతీకారంగా ఉగ్రవాదుల స్థావరాలను నేలమట్టం చేయడంపై ఆయన హర్షం వ్యక్తంచేశారు. "మన నేలపై మొలిచిన మొక్క కూడా పీకలేరు! వంద పాకిస్థాన్లకు సమాధానం చెప్పే మిసైల్ పేరు మోదీ" అని పేర్కొంటూ ఓ ప్రత్యేక వీడియోను 'ఎక్స్'లో షేర్ చేశారు.

ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ అమరావతి పునఃప్రారంభోత్సవ వేడుకలకు విచ్చేసిన సందర్భంలో తాను చేసిన ప్రసంగంలోని కొన్ని పాయింట్లు, పాక్ ఉగ్రవాద స్థావరాలపై సైన్యం జరిపిన దాడుల దృశ్యాలు, ప్రధాని మోదీ ప్రసంగంలోని కొన్ని మాటలతో కలిపి 54 సెకన్ల నిడివి కలిగిన వీడియోను ఆయన పంచుకున్నారు. అంతకుముందు ఈ అంశంపై ట్వీట్ చేసిన లోకేశ్ "భారతదేశ సార్వభౌమత్వాన్ని పరీక్షించేందుకు ధైర్యం చేసేవారికి ఇదో గట్టి సందేశం. ప్రధాని నరేంద్ర మోదీ దృఢమైన నాయకత్వంలో భారత్ అచంచలమైన దృఢ సంకల్పంతో కచ్చితంగా ప్రతిదాడి చేస్తుంది. ప్రధాని మోదీకి హృదయపూర్వక అభినందనలు. ఆయన ధైర్యం, దేశ భద్రత పట్ల అంకితభావం.. పాక్ను భయభ్రాంతులకు గురిచేశాయి. రతీయులందరూ గర్వపడేలా చేశాయి. భారత్ ఐక్యంగా ఉంది. ఈ భూమిపై ఏ శక్తీ మన స్ఫూర్తిని విచ్ఛిన్నం చేయలేదు" అని పేర్కొన్నారు.

భారత పౌరుడిగా గర్వంగా ఉంది..
'ఆపరేషన్ సిందూర్'పై సీఎం రేవంత్ రెడ్డి

పాక్ లోని ఉగ్ర శిబిరాలపై మన సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్' పట్ల భారత పౌరుడిగా గర్వంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

హైదరాబాద్, మే 7, (రిపబ్లిక్ న్యూస్): పాక్లోని ఉగ్ర శిబిరాలపై మన సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' పట్ల భారత పౌరుడిగా గర్వంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. దేశ పౌరులుగా అందరం ఏకతాటిగా నిలిచి ఐక్యత చాటాల్సిన సమయమిదంటూ 'జైహింద్' అని పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో సీఎం పోస్ట్ చేశారు. 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అన్ని విభాగాలకు సీఎం దిశానిర్దేశం చేశారు. సాయంత్రం జరిగే మాక్ డ్రిల్లు ఆయన స్వయంగా పర్యవేక్షించనున్నారు. మరోవైపు దిల్లీలో ఉన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు సీఎం ఫోన్ చేశారు. తక్షణమే బయల్దేరి హైదరాబాద్ రావాలని సూచించారు.

ఇలాంటి సమయంలో రాజకీయాలకు తావులేదు:సీఎం రేవంత్ రెడ్డి

సైన్యంతో మనమంతా ఉన్నామనే సందేశం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

హైదరాబాద్, మే 7, (రిపబ్లిక్ న్యూస్): 'ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో సైన్యంతో మనమంతా ఉన్నామనే సందేశం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇలాంటి సమయంలో రాజకీయాలకు తావు లేదన్నారు. అత్యవసర సేవలు అందించే విభాగాల ఉద్యోగుల సెలవులను రద్దు చేస్తున్నట్లు చెప్పారు.

ఉద్యోగులు, మంత్రులు, అధికారులందరూ అందుబాటులో ఉండాలన్నారు. మంత్రులు, అధికారులు విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలని ఆదేశించారు. ఉద్యోగులు మీడియా, సోషల్ మీడియాలో అనవసర ప్రకటనలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్ ఫ్రీ నంబర్ సిద్ధం చేయాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం సాయంత్రం 6 గంటలకు ర్యాలీ నిర్వహించనున్నారు. నగరంలోని సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు ఇది కొనసాగనుంది. సీఎం రేవంత్రెడ్డి, మంత్రులు, ఇతర నేతలు పాల్గొననున్నారు.

హైదరాబాద్లో
విజయవంతంగా ముగిసిన సివిల్ మాక్ డ్రిల్

భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్రహోం శాఖ ఇచ్చిన ఆదేశాల మేరకు హైదరాబాద్లో సివిల్ మాక్ డ్రిల్ విజయవంతంగా ముగిసింది.

హైదరాబాద్, మే 7, (రిపబ్లిక్ న్యూస్): భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్రహోం శాఖ ఇచ్చిన ఆదేశాల మేరకు హైదరాబాద్లో సివిల్ మాక్ డ్రిల్ విజయవంతంగా ముగిసింది. హైదరాబాద్లో ఆపరేష్ అభ్యాస్ పేరుతో జరుగుతున్న ఈ మాక్ డ్రిల్లో వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించాల్సిన విధానంపై అవగాహనకు మాక్ డ్రిల్ నిర్వహించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో రెండు నిమిషాల పాటు సైరన్ మోగింది. హైదరాబాద్లోని ప్రధాన కూడళ్లలో సైరన్లు మోగాయి. ఒకవేళ యుద్ధం అనివార్యమైతే పౌరులు పాటించాల్సిన నియమాలను ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది వివరిస్తున్నారు. నగరంలోని నాలుగు ప్రాంతాలు (నానల్నగర్, కంచన్బాగ్, సికింద్రాబాద్, ఈసీఐఎల్ ఎన్ఎఫ్సీ) నుంచి కొనసాగుతోన్న మాక్ డ్రిల్స్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు, మాక్ డ్రిల్లో భాగంగా ఫైరింగ్ జరిగినట్లుగా శబ్దాలు వినబటం, కొందరు సంఘ విద్రోహ శక్తులు కాల్పులు జరుపుతుండటం, ఒక భవనంలోకి వెళ్లి కాల్పులు జరిపితే.. అక్కడ ఉన్నవారిని సురక్షితంగా బయటకు తీసుకొస్తున్నట్లుగా దృశ్యాలను మాక్డ్రిల్లో ప్రదర్శించారు. డీఆర్డీఏ సమీపంలోని ఓ కాలనీలోని 24 అంతస్తుల భవనంలో అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ఎలా సురక్షితంగా కాపాడాలనే అంశాన్ని వివరించారు. అక్కడ ఫైరింజన్లను మోహరించారు. మొత్తంగా 12శాఖల అధికారుల సమన్వయంతో ఈ మాల్ నిర్వహించారు. కాల్పుల్లో గాయపడిన వారిని తోటివారి సహాయంతో సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలించాలనే అంశంపై అవగాహన కల్పించారు. మరోవైపు, విశాఖలోని పాత పోస్టాఫీస్ కూడలిలో మాక్డ్రిల్ నిర్వహించారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో వ్యవహరించాల్సిన విధానంపై అవగాహన కల్పించారు. ప్రజలు, సహాయక సిబ్బంది వ్యవహరించాల్సిన విధానంపై అవగాహన కల్పించారు. సైరన్ శబ్దాలతో ఈ మాల్ మొదలైంది.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్

చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1861 : విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జననం. (మ. 1941). (చిత్రంలో)
- 1921 : తెలుగు నాటక రచయిత, సినీకవి ఆత్రేయ జననం. (మ. 1989).
- 1924 : స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామ రాజు మరణం. (జ. 1897).
- 1946 : సోని కార్పొరేషన్‌ను జపాన్‌లో స్థాపించారు.
- 1983 : 7వ అలీన దేశాల శిఖరాగ్ర సమావేశం ఢిల్లీలో ఇందిరా గాంధీ అధ్యక్షతన ప్రారంభం.


రవీంద్రనాథ్ ఠాగూర్

ఆత్రేయ

అల్లూరి సీతారామ రాజు

సోని కార్పొరేషన్

ఇందిరా గాంధీ

రిపబ్లిక్ స్పోర్ట్స్

అసలైన డ్రామా.. ఆ మూడు ఓవర్లే ముంబయిని ఓడించాయి!

ప్లేఆఫ్స్ రేసు ఉత్కంఠగా మారుతోంది. చివరి బంతి వరకూ విజయం కోసం ప్రతి జట్టూ కష్టపడుతోంది. తాజాగా ముంబయిపై గుజరాత్ అద్భుత విజయం నమోదు చేసింది.

లక్ష్యం 156 పరుగులు. టీ20ల్లో ఇదేమీ పెద్ద కష్టం కాదు. కానీ, బౌలింగ్కు అనుకూలించే పిచ్పి కఠినమే. అందుకు తగినట్టుగానే ముంబయి ఇండియన్స్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ ఎటాక్ను మొదలుపెట్టారు. కానీ, వర్షం కారణంగా మ్యాచ్ ఫలితం మలుపులు తిరిగి చివరికి గుజరాత్ టైటాన్స్ వైపే విజయం వచ్చి చేరింది. మొదట్లో అదరగొట్టిన ముంబయి ఆఖరికి ఓడిపోవడానికి కారణం మూడు ఓవర్లు మాత్రమే. దీంతో ముంబయి వరుస ఆరు విజయాలకు గుజరాత్ చెక్ పెట్టినట్లైంది.

తొలి స్టెప్.. 8వ ఓవర్.. కెప్టెనే ముందుండి..

ముంబయి బౌలర్లు ట్రెంట్ బౌల్ట్, జస్ప్రీత్ బుమ్రా, దీపక్ చాహర్ కట్టుదిట్టంగా బంతులేయడంతో పవర్ ప్లే ముగిసేసరికి గుజరాత్ స్కోరు 29/1. తర్వాత (7వది) ఓవర్లో దీపక్ చాహర్ 11 పరుగులు ఇచ్చాడు. దీంతో గుజరాత్ ఏడు ఓవర్లకు 40/1తో ఉంది. అప్పటికే వర్షం పడుతుందేమోనని అనిపించింది. డక్ వర్త్‌రీయిస్ పద్ధతి ప్రకారం గుజరాత్ 46/1 ఉండాలి. అంటే ఆరు పరుగులు వెనకబడి ఉంది. ఈ క్రమంలో బౌలింగ్కు వచ్చిన ముంబయి కెప్టెన్ హార్దిక్ పాండ్య సుదీర్ఘమైన ఓవర్ సంధించాడు. మొదటి మూడు బంతులకు ఆరు పరుగులు ఇచ్చిన పాండ్య.. తర్వాత ఒక సిక్స్, రెండు నోబాల్స్, మూడు వైడ్లతో కలిపి ఆ ఓవర్లో ఏకంగా 18 పరుగులు సమర్పించాడు. ఇదే గుజరాత్ ఇన్నింగ్స్ను ఊపిరిపోసింది. డక్ వర్త్ లూయిస్ ప్రకారం 8 ఓవర్లకు 53/1 ఉంటే చాలు. కానీ, గుజరాత్ అప్పటికే 58/1 స్కోరు సాధించింది.

సెకండ్ స్టెప్.. మార్చేసిన 13వ ఓవర్

ఆ తర్వాత ముంబయి బౌలర్లు మళ్లీ కట్టుదిట్టంగా బంతులేసి గుజరాత్‌ను కట్టడి చేసేందుకు ప్రయత్నించారు. కీలకమైన జాస్ బట్లర్ (30)ను అశ్విని కుమార్ ఔట్ చేశాడు. ఈ సమయంలో వర్షం భారీగా మ్యాచ్ రద్దై ఉంటే ముంబయికి రెండు పాయింట్లు కలిసొచ్చేవి. ఎందుకంటే అప్పటికి గుజరాత్ స్కోరు 12 ఓవర్లకు 79/2. ఎందుకంటే డ/లూ పద్ధతి ప్రకారం 84 పరుగులు చేసి ఉండాలి. ఎప్పుడైతే బట్లర్ ఔటై రూథర్ఫోర్డ్ వచ్చాడో గుజరాత్ పరిస్థితి మారిపోయింది. 13వ ఓవర్ తొలి మూడు బంతులకు ఒక్క పరుగూ రాలేదు. ఆ తర్వాత వైడ్ ఇచ్చిన విల్ జాక్స్ను రూథర్ఫోర్డ్ వరుసగా రెండు ఫోర్లు, సిక్స్ తో చుక్కలు చూపించాడు. ఒక్కసారిగా మ్యాచ్ స్వరూపం మారిపోయింది. గుజరాత్ ముందుకు దూసుకుపోయింది. 14వ ఓవర్ లోనూ 13 పరుగులు వచ్చేశాయి. ఆ తర్వాత వర్షం పడటంతో మ్యాచ్కు అంతరాయం కలిగింది. ఒకవేళ అప్పుడే రద్దైనా జీటీదే విజయం. దాదాపు అరగంట తర్వాత మళ్లీ మ్యాచ్ పునఃప్రారంభమైంది.

థర్డ్ స్టెప్.. ఆఖరి ఓవర్ ఇలా..

15వ ఓవర్ నుంచి 18వ ఓవర్ వరకు కేవలం 25 పరుగులే ఇచ్చిన బుమ్రా, బౌల్ట్ నాలుగు వికెట్లు తీసి ముంబయిని మంచి స్థితిలో ఉంచారు. 19వ ఓవర్ వేసే సమయంలో భారీ వర్షం వచ్చేసింది. అప్పటికే గుజరాత్ ఐదు పరుగులు వెనకబడి ఉంది. పాపం ముంబయికి కలిసిరాలేదు. వర్షం తగ్గడంతో 19 ఓవర్లకు 147 పరుగులను టార్గెట్గా నిర్దేశించారు. అంటే ఆరు బంతుల్లో 15 పరుగులు గుజరాత్ లక్ష్యం. అప్పటికే స్లో ఓవర్ రేట్ కారణంగా ముంబయి ఓ ఫీల్డర్ను ఇన్నర్ రింగ్లోనే ఉంచుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. తొలి మూడు బంతుల్లోనే సిక్స్, ఫోర్ సహా 11 పరుగులను దీపక్ చాహర్ ఇచ్చేశాడు. నాలుగో బంతిని నోబాల్ సంధించాడు. ఫ్రీహిట్ వచ్చేసింది. కానీ, తెవాతియా సింగిల్ మాత్రమే కొట్టగలిగాడు. దీంతో స్కోర్లు సమమయ్యాయి. అంటే చివరి రెండు బంతుల్లో ఒక్క పరుగు చేస్తే చాలు. ఐదో బంతికి కోయిట్జీని దీపక్ ఔట్ చేశాడు. చివరి బంతికి ఏమైనా మ్యాజిక్ జరుగుతుందా? అని ముంబయి అభిమానులు ఆశించారు. కానీ, అర్షద్ ఖాన్ సింగిల్ తీసి గుజరాత్కు విజయాన్ని అందించాడు. అయితే, రనౌట్ చేసే అవకాశం చేజారడంతో ముంబయి మ్యాచ్ కూడా కోల్పోవాల్సి వచ్చింది.

'ఆపరేషన్ సిందూర్' కలిసి నిలబడదామంటూ ప్రముఖుల పోస్టు..

'ఆపరేషన్ సిందూర్'పై ప్రముఖులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. భారత్ మాతా కీ జై అంటూ పోస్టు పెడుతున్నారు.

పహల్గాంలో జరిగిన పైశాచిక చర్యకు భారత్ దీటైన స్పందన ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది. మంగళవారం అర్ధరాత్రి 1.44 గంటలకు 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్లోని ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం మెరుపు దాడులు చేసింది. దీనిపై ప్రముఖులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. మేమంతా మీ వెంటే ఉంటామంటూ భారత్ సైన్యంను ఉద్దేశిస్తూ పోస్టు పెడుతున్నారు. 'జై హింద్', 'భారత్ మాతాకీ జై', 'ఆపరేషన్ సిందూర్' అంటూ హ్యాష్ ట్యాగ్ తో సోషల్ మీడియాలో పోస్టు వెల్లువెత్తుతున్నాయి. 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైనందుకు ఆనందంగా ఉందంటూ అగ్ర కథానాయకుడు చిరంజీవి 'జైహింద్' అని రాశారు.

ఎన్నో రోజుల నిశ్శబ్దం తర్వాత 'ఆపరేషన్ సిందూర్' భారతదేశం మొత్తంలో స్ఫూర్తిని నింపింది. త్రివిధ దళాల ధైర్యం, అలాగే ఈ ఆపరేషన్కు నాయకత్వం వహించి సైన్యానికి అండగా ఉన్న ప్రధానమంత్రికి ధన్యవాదాలు. మేమంతా మీతోనే ఉన్నాం" – పవన్ కల్యాణ్

మా ప్రార్థనలన్నీ భద్రతా బలగాలతో ఉంటాయి. ఒకే దేశం.. కలిసి నిలబడదాం – ఆనంద్ మహీంద్రా

పోరాటం ఇప్పుడే ప్రారంభమైంది. లక్ష్యం పూర్తయ్యేవరకూ ఆగదు. దేశం మొత్తం మీతో ఉంది. జైహింద్ – రజనీకాంత్

"ఉగ్రవాదాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో మాత్రమే భారత్ చర్యలు చేపట్టింది. పాకిస్థాన్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకోలేదు. మన దేశం లక్ష్యాలను నిర్దేశించుకోవడంలో సంయమనం పాటించింది. 26 మందిని దారుణంగా చంపినందుకు మాత్రమే ఈ చర్యలు జరిపింది. మేం నిబద్ధతకు కట్టుబడి ఉంటాం"– ప్రకాశ్ రాజ్

ప్రస్తుతం ప్రతి కదలిక పైనా దృష్టిపెట్టాలి. అన్నిటినీ నిశితంగా పరిశీలించాలి. – విశ్వక్సేన్

జై హింద్ కీ సేనా.. భారత్ మాతాకీ జై. – రితేశ్ దేశముఖ్

భారత్ మాతా కీ జై.. న్యాయం జరిగింది – ఖుష్బూ

భద్రతా దళాలకు మరింత బలాన్నివ్వాలని ప్రార్థిద్దాం. ఒకే దేశం.. కలిసి నిలబడదాం. వందేమాతరం – మధుర్ భండార్కర్

బాలీవుడ్ స్టార్ హీరోను కలిసిన అల్లు అర్జున్

ఆమిరాఖాన్‌తో అల్లు అర్జున్ ఉన్న ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

బాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఆమిర్ ఖాన్‌ను అల్లు అర్జున్ కలిశారు. ముంబయిలోని ఆమిర్ నివాసానికి వెళ్లిన బన్నీ ఆయనతో కలిసి కొంత సమయం ముచ్చటించారు. ప్రస్తుతం ఈ ఫొటో వైరల్ అవుతుండగా.. అభిమానులు వీరిద్దరి కాంబినేషన్లో సినిమా వస్తుందేమోనని ఆశిస్తున్నారు. ఇటీవల ఆమిర్ ఖాన్ మాట్లాడుతూ తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'మహా భారతం' గురించి తెలిపారు. అందులో అగ్ర కథానాయకులు భాగం కానున్నట్లు చెప్పారు. దీంతో బన్నీ ఈ ప్రాజెక్ట్ నటించనున్నారా అనే సందేహాలు వస్తున్నాయి. ప్రస్తుతం అట్లీ సినిమాతో బిజీగా ఉన్నారు అల్లు అర్జున్. ఇందులో ఆయన ద్విపాత్రాభినయంలో నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం దీని ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఇందులో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించనున్నారు. దీనికోసం అట్లీ, అల్లు అర్జున్ లాస్ ఏంజెలెస్ లోని ప్రముఖ వీఎఫ్ఎక్స్ సంస్థను ఇటీవల సంప్రదించారు. ఇందులో హాలీవుడ్ తరహాలో విజువల్స్ ఉండనున్నట్లు తెలిపారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

తెర పైకి ధీరురాలి జీవిత చరిత్ర.. అధికారికంగా ప్రకటించిన ప్రభుత్వం

మరాఠి రాణి అహల్యా బాయి హోల్కర్ జీవిత కథను సినిమాగా తీయనున్నట్లు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ ప్రకటించారు.

ఇప్పటికే ఎంతోమంది ధీరులు బయోపిక్ లు ప్రేక్షకులను ఆకట్టుకున్న విషయం తెలిసిందే. తాజాగా మరో ధీరురాలి జీవితం సినిమాగా రూపొందనుంది. మరాఠి రాణి అహల్యా బాయి హోల్కర్ జీవితంపై సినిమా తీయనున్నట్లు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ ప్రకటించారు. రాణి అహల్యా బాయి హోల్కర్ 300వ జయంతిని పురస్కరించుకొని మహారాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రమంతటా కొన్ని ప్రాజెక్ట్ కు శ్రీకారం చుట్టింది. అలానే ఆమె జీవితం ఎంతోమందికి స్ఫూర్తి అని అందుకే సినిమాగా ప్రేక్షకులకు అందించాలని నిర్ణయించుకున్నట్లు సీఎం తెలిపారు. దీనిపై ఇప్పటికే చర్చలు ప్రారంభమైనట్లు వెల్లడించారు. మరాఠీతో పాటు ఇతర భాషల్లోనూ ఈ సినిమా విడుదల చేయనున్నట్లు చెప్పారు. దూరదర్శన్, ఇతర ఓటీటీ ప్లాట్ఫామ్లలోనూ రాణి అహల్యా బాయి హోల్కర్ బయోపిక్ అందుబాటులో ఉండేలా చూస్తామని అన్నారు. ఇటీవలే మరాఠా యోధుడు శంభాజీ మహారాజ్ వీరగాథ 'ఛావా' ప్రేక్షకుల ముందుకువచ్చి భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా విడుదలైన అన్ని భాషల్లోనూ బ్లాక్బస్టర్గా నిలిచింది. ఎన్నో రికార్డులను తన ఖాతాలో వేసుకున్న 'ఛావా' ప్రస్తుతం నెటిక్స్ వేదికగా అందుబాటులో ఉంది.

రిపబ్లిక్
9948814188,
9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాప్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నెం:46/181/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

ఆరోగ్యం

పొరపాటున కూడా కొందరు ఉల్లిపాయను ఎట్టి పరిస్థితుల్లో తినకూడదు, ఎవరు దూరంగా ఉండాలో తెలుసా?

ఉల్లిపాయలతో ఎన్నో ఆరోగ్యం ప్రయోజనాలు ఉన్నాయి. అయితే, ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నప్పటికీ కొందరు మాత్రం ఉల్లిపాయ తినకూడదు.

ఉల్లిపాయలు ప్రతి ఇంటి వంటగదిలో ఉండాల్సిందే. వంటల్లో ఎక్కువగా ఉల్లిపాయను వాడతారు. చాలా మంది ఉల్లిపాయ లేకుండా వంటలు వండలేరు. ఉల్లిపాయ డిమాండ్ అలాంటిది మరి. ఉల్లిపాయతో చేసే వంటలు రుచిగా ఉండటమే కాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదన్న సామెత ఉంది. అంటే ఉల్లిపాయలతో ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. ఉల్లిపాయల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. దీంతో మన జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుంది. ఉల్లిపాయలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఇన్ఫ్లమేషన్లను తగ్గిస్తాయి. అంతేకాకుండా ఉల్లిపాయను జట్టు సంరక్షణ కోసం వాడతారు. అంతేకాకుండా అందం మెరుపులకు కూడా ఉల్లిపాయ మంచి ఔషధం. ఇలా ఉల్లిపాయలతో ఎన్నో ఆరోగ్యం ప్రయోజనాలు ఉన్నాయి. అయితే, ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నప్పటికీ కొందరు మాత్రం ఉల్లిపాయ తినకూడదు. తింటే లేనిపోని సమస్యలు వస్తాయి. పచ్చి ఉల్లిపాయలు ఎవరు, ఎందుకు తినకూడదో ఇక్కడ తెలుసుకుందాం.

గ్యాస్, ఎసిడిటీ సమస్యలు ఉన్నవారు

ఈ రోజుల్లో చాలా మంది గ్యాస్, ఎసిడిటీ వంటి సమస్యలతో బాధపడుతున్నారు. అలాంటి వారు ఉల్లిపాయల్ని ఎక్కువగా తినకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉల్లిపాయలో గ్లూకోజ్, ఫ్రక్టోజ్ వంటి అనేక అంశాలు ఉంటాయి. వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరంలో ఆమ్లత్వం పెరుగుతుంది. ఇప్పటికే ఎసిడిటీ వంటి సమస్యలతో బాధపడేవారు తింటే మీ పరిస్థితి ఇంకా దిగజారవచ్చు.



మలబద్ధకంతో బాధపడేవారు కూడా ఉల్లిపాయ ఎక్కువగా తినకూడదని ఎక్స్పర్ట్స్ చెబుతున్నారు.

డయాబెటిస్

డయాబెటిస్‌తో బాధపడేవారు కూడా ఉల్లిపాయ తినే విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఉల్లిపాయలో గ్లూకోజ్, ఫ్రక్టోజ్ ఉంటాయి. ఉల్లిపాయలను అధికంగా తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ఇది మీ ఆరోగ్యానికి హానికరంయ. కాబట్టి షుగర్ రోగులు ఉల్లిపాయలను పరిమిత పరిమాణంలో తీసుకోవాలి. ఒకవేళ మీరు ఉల్లిపాయ ఎక్కువగా తినాలనుకుంటే వైద్యుణ్ణి సంప్రదించి తగిన సలహా తీసుకోవడం ముఖ్యం.

గర్భిణీ స్త్రీలు

గర్భిణీ స్త్రీలు తమ ఆరోగ్యం, ఆహారం పట్ల చాలా శ్రద్ధ వహించాలి. ఉల్లిపాయలను అధికంగా తీసుకోవడం గర్భిణీ స్త్రీలకు హానికరం కావచ్చు. అది గుండెల్లో మంటను కలిగిస్తుంది. అందుకే ప్రెగ్నెన్సీ సమయంలో ఉల్లిపాయల్ని ఎక్కువగా తినకూడదని పెద్దలు అంటుంటారు. పాలిచ్చే తల్లులు కూడా ఉల్లిపాయలు తినే విషయంలో అలర్ట్గా ఉండండి. ఎక్కువగా తింటే బిడ్డ జీర్ణక్రియపై ప్రభావం చూపే అవకాశం ఉంది. పిల్లల్లో కడుపునొప్పి వచ్చే అవకాశం ఉంది.

ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ (ఐబిఎస్)

జీర్ణక్రియ బలహీనంగా ఉన్నవారు ఉల్లిపాయను తినకపోవడమే మేలు. ఉల్లిపాయలలో ఎఫ్ఓడిఎంఏపిలు (కిణ్వ ప్రక్రియకు గురయ్యే ఒలిగోశాకరైడ్లు, డైశాకరైడ్లు, మోనోశాకరైడ్లు, పాలియోల్స్) ఉండటం వల్ల కొన్నిసార్లు ఐబిఎస్ లక్షణాలకు ట్రిగ్గర్ కావచ్చు. ఈ కారణం వల్ల జీర్ణక్రియ సమస్యలతో బాధపడేవారు ఉల్లిపాయ బెస్ట్ ఆప్షన్ కాదు. ఉల్లిపాయ తినడం వల్ల కడుపు నొప్పి, అజీర్తి, ఉబ్బరం వంటి సమస్యలను ఎదుర్కోవచ్చు.

రక్తస్రావం లోపాలు

కొన్ని అధ్యయనాల ప్రకారం ఉల్లిపాయలు రక్తం గడ్డకట్టడాన్ని నెమ్మదించేలా చేస్తాయి. ఇప్పటికే రక్తస్రావం లోపాలతో బాధపడేవారు ఉల్లిపాయల్ని తినకూడదు. అంతేకాకుండా రక్త గడ్డకట్టడంలో ఇబ్బందులు పడేవారు మందులు తీసుకుంటుంటారు. ఇలాంటి వారు కూడా ఉల్లిపాయలకు దూరంగా ఉండాలి. ఎందుకంటే ఇవి మెడిసిన్‌తో రియాక్షన్ జరిపే అవకాశం ఉంది.

వీళ్లు కూడా జాగ్రత్త

- దుర్వాసన సమస్యతో బాధపడేవారు కూడా ఉల్లిపాయకు దూరంగా ఉండాలి. ఉల్లిపాయ తినడం వల్ల మీ సమస్య ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. ఎందుకంటే ఉల్లిపాయలో సల్ఫర్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి వాసనను పెంచుతాయి.
- కొంతమందికి ఉల్లిపాయలు తినడం వల్ల చర్మంపై దద్దుర్లు, మంట, వాపు వచ్చే అవకాశం ఉంది. ఇలా అలెర్జీ సమస్యలతో బాధపడేవారు ఉల్లిపాయలకు దూరంగా ఉండాలి.
- అపానవాయువు సమస్యతో బాధపడేవారు కూడా ఉల్లిపాయల్ని మితంగా తినాలి. లేదంటే మీ సమస్య తీవ్రం కావచ్చని నిపుణులు అంటున్నారు.

గమనిక

ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి. తెలుగు సమయం ఈ విషయాల్ని ధృవీకరించడం లేదు. ఖచ్చితత్వం, ప్రభావానికి తెలుగు సమయం బాధ్యత వహించదు.